TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 37 | గురువారం, ఆగస్టు 20,2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 37 | 20-08-2026 (THURSDAY) | PAGES: 4 | RS : 5/-

పేపర్ లీక్‌లపై కేంద్రం

సర్జికల్ స్ట్రైక్

న్యూ ఢిల్లీ : దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, ప్రశ్నపత్రాల్లో దొర్లిన తప్పులు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును, వారి తల్లిదండ్రుల నిరీక్షణను తీవ్ర ఆందోళనకు గురిచేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఎన్‌టీఏలో భారీ ప్రక్షాళన చర్యలకు శ్రీకారం చుట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ఖచ్చితత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా ఏకంగా 600 మంది సబ్జెక్ట్ నిపుణులను ప్యానెల్ నుంచి తొలగించి, వారి స్థానంలో సరికొత్త నిపుణులను నియమించనున్నారు. ప్రశ్నపత్రాల పరిశీలనకు 'నాలుగంచెల వ్యవస్థ'. యూజీసీ-నెట్ వంటి పరీక్షల్లో అనువాద లోపాలు, అచ్చుతప్పులు, ప్రశ్నల పునరావృతం వంటి తీవ్ర సమస్యలు తలెత్తడంతో ప్రశ్నపత్రాల రూపకల్పన ప్రక్రియను కట్టుదిట్టం చేశారు. 4 దశల పరిశీలన: ఇకపై ప్రతి ప్రశ్నపత్రాన్ని పరీక్షకు ముందు నాలుగు స్థాయిల్లో నిశితంగా పరిశీలిస్తారు. విషయ నిపుణులు, సైకోమెట్రీ నిపుణులు, స్వతంత్ర విశ్లేషకులు పేపర్‌ను పరిష్కరించి భాషా దోషాలు, ఫార్మాటింగ్ సమస్యలు, సాంకేతిక లోపాలు ఏవీ లేకుండా చూస్తారు. 30 రోజుల్లో ఆడిట్ రిపోర్ట్: ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ ప్రక్రియ మొత్తాన్ని సమగ్రంగా ఆడిట్ చేసి, సరిదిద్దిన చర్యలపై 30 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని మంత్రి జోషి ఆదేశించారు. సీఐఎస్ఎఫ్ భద్రత -- హెడ్‌క్వార్టర్స్ తరలింపు.. పరీక్షల గోప్యతను కాపాడేందుకు మౌలిక సదుపాయాలు ఇంకా కార్యాలయ

భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్నారు.. కార్యాలయ మార్పు: దక్షిణ ఢిల్లీలోని ఓఖ్లా పారిశ్రామిక ప్రాంతం నుంచి సెంట్రల్ ఢిల్లీలోని మింటో రోడ్ గవర్నమెంట్ ప్రెస్ భవనంలోకి ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయాన్ని యుద్ధప్రాతిపదికన తరలిస్తున్నారు. సీఐఎస్ఎఫ్ మోహరింపు: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం బృందాల ను మోహరించి, ఎన్‌టీఏ ప్రధాన మరియు ప్రాంతీయ కార్యాలయాలకు 24 గంటల పటిష్ట భద్రతను కల్పించనున్నారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ : అత్యంత రహస్యంగా సాగే ప్రశ్నపత్రాల పనుల కోసం ప్రత్యేక ఏకాంత గదులు, ఇంటర్నెట్ లేని కంప్యూటర్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ పరికరాల డిపాజిట్ నిబంధనలను తప్పనిసరి చేశారు.

మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

న్యూ ఢిల్లీ : విద్యార్థులు, యువత భవిష్యత్తును గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీ స్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉ పాధి అవకా శాలు కల్పించేలా కాంగ్రెస్ సమగ్ర 'ఎడ్యు కేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ రోడ్‌మ్యాప్' రూపొందించాల్సిన సమయం ఆసన్న మైందని అన్నారు. దిల్లీలని ఇందిరా భవన్ లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభ ప్రసంగం సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో కొత్త పాఠశాల లు ప్రారం భం కావాల్సి ఉంది. అవి కాక పోగా, ఇటీ వల సంవత్సరాల్లో సుమారు 94వేల పాఠ శాలలు మూతపడ్డాయి. యువత భవిష్య త్తును మెరుగుపరిచే విధా నాల స్థానంలో విద్యా రంగంలో ప్రైవేటీ కరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటీకర ణ పెరగడంతో ఉన్నత విద్య ఖరీదైనదిగా మారుతోంది. కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోంది.

ప్రజాసమస్యలు అసెంబ్లీలో

చర్చిస్తేనే విలువ

అమరావతి: దేవాలయం వంటి అసెంబ్లీని ఓ పార్టీ మొత్తం బహిష్కరించడం చరిత్రలోనే లే దని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లా డిన చంద్ర బాబు అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చిస్తే విలువ, గుర్తింపు ఉంటాయని, అలాకా కుండా బయట కూర్చొని ఎంత మాట్లాడినా ఏం విలువ ఉండదని వివరించారు. ప్రజాస్వా మ్య వ్యవస్థలో అసెంబ్లీ అనేది అత్యున్నత స్థానమని అలాంటి వేదికను ఓ పార్టీ బహి ష్కరించడం తన రాజ కీయ జీవితంలో చూడలే దన్నారు. ప్రజలు సభ్యుల్ని ఎన్నుకునేది తమ సమస్యలపై అసెం బ్లీలో మాట్లాడతారనేనని సీఎం అన్నారు. వారికి రాజకీయాలు అవసర మా?: గతంలో 1978లో వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డిలు ఇద్దరే సభను అల్లాడించారని గుర్తు చేశారు. 1989-94 సమయంలో ఎన్టీఆ ర్ మధ్యలో కొన్ని రోజులు సభకు రాకపోయినా తామంతా పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడామని వివరించారు. 2019-24 మధ్య తాను సభలో సవాల్ చేసి బయటకు వచ్చినా తమ ఎమ్మెల్యేలు చివరి రోజు వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించారని వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని చులకన చేసే 'గొడ్డలి పార్టీ' నాయకుడికి రాజకీయాలు అవసరమా? అని చంద్రబాబు నిలదీశారు.

టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం

కొత్త జీవో

హైదరాబాద్: భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖా తాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

మంథని అభివృద్ధికి రూ.800 కోట్లతో

రహదారుల పనులు

- కమాన్‌పూర్--మంథని నాలుగు లేన్ల రహదారికి రూ.200 కోట్లు
- ప్రతి 15 రోజులకు రహదారి పనులపై సమీక్ష
- రూ.20 కోట్లతో ఎన్‌ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్
- 18 నెలల్లో పనులు పూర్తి చేస్తాం
- మంథని లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, శ్రీధర్ బాబు

మంథని : మంథనిలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. గంగాపురి వద్ద రూ.20 కోట్లతో ఎన్‌ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మంథని--రామగుండం నాలుగు లేన్ల రహదారి విస్తరణకు రూ.21 కోట్లు, ఇతర ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.97 కోట్లు, మంథని పట్టణంలో రూ.15 కోట్లతో బీటీ రోడ్లు, రూ.9 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో నాలుగు మండలాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మైనార్టీలకు కుట్టుమిషన్లు, మహిళా స్వశక్తి సంఘాలకు చెక్కులను మంత్రులు పంపిణీ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.800 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామని తెలిపారు. గోదావరి నదిపై హై లెవల్ బ్రిడ్జికి రూ.125 కోట్లు, బైపాస్ రహదారికి రూ.162 కోట్లు, హెచ్ఏఎం రహదారులకు రూ.203 కోట్లు, మంథని--ఓడేడు రహదారికి రూ.60 కోట్లు తదితర పనులకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. అన్ని రహదారి పనులను 18 నెలల్లో పూర్తి చేస్తామని, ప్రతి 15 రోజులకు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. కమాన్‌పూర్ నుంచి మంథని మున్సిపాలిటీ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తీసుకుంటామని, 15 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రజా పాలన కాదు..

ప్రజా కంటక పాలన

హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రజాపాలనగా లేదని ప్రజా కంటక పాలనగా కొనసాగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు) ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో లైసెన్స్ సర్వేయర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం 70వేల ఉద్యోగాలు ఇచ్చామని, గొప్పలు చెప్పుకోవడమే తప్ప, వారికి జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. జీతాలు ఇవ్వం మీరు రైతుల దగ్గర లంచాలు తీసుకోండి అని ప్రభుత్వం పరోక్షంగా సూచిస్తుం దని విమర్శించారు. యువత సాధించనది ఏదీ లేదని, ఇటీవల కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు కూడా జెన్ జీ పోరాటాన్ని గుర్తు చేసుకో వాలని ప్రభుత్వానికి సూచిం చారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. ప్రభుత్వం పని చేస్తే ప్రతిపక్ష పార్టీ వద్దకు ప్రజలకు ఎందుకు వస్తారని ప్రశ్ని ంచారు. సర్వేయర్ల సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉ న్నాయని పేర్కొ న్నారు. ఇప్పటికే ఇద్దరు సర్వేయర్లు ఆత్మ హత్య చేసుకున్నారని, వారి సమస్యలనువచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ప్రస్తావి స్తుందని వెల్లడించారు. ఉ ద్యోగాల విషయంలో రేవంత్ రెడ్డి అబద్దాలు ఆడుతున్నారని విమర్శించారు.

టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా

వరంగల్ : కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ సంచలన ప్రకటన చేశారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పర కాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవ హారశైలిలో మార్పు వచ్చిందని అన్నా రు. 'పొంగులేటి ముఖ్యమం త్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానిం చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా ముర ళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. 'హామీ ఇవ్వలేదని ప్రమాణం చేస్తారా?' కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు.

కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై

హైకోర్టు కీలక వ్యాఖ్యలు.

హైదరాబాద్, ఆగస్టు 19: ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో రేపు(గురువారం) చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

హైదరాబాద్ అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర కీలకం

– 'పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం' కార్యాలయాన్ని సందర్శించిన శ్రీనివాస్ గౌడ్

ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి : హైదరాబాద్ మహానగర నిర్మాణం, అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నగరంలోని ఎల్లమ్మబండలోని 'పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం' కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పాలమూరు వాసుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గతంలో తాను కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఎల్లమ్మబండ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేసుకున్నారు.
పాలమూరు జిల్లా అంటే ఒకప్పుడు వలస కార్మికుల జిల్లాగా పేరుండేదని ఆయన అన్నారు. ఎల్లమ్మబండతో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పాలమూరు వాసులు నివసిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ నగర నిర్మాణంలో తమ శ్రమను ధారపోసిన పాలమూరు కార్మికుల సేవలను గుర్తించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంతం నుంచి వలసలు తగ్గాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో అనేక మంది వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, సీనియర్ జర్నలిస్టులు ఆర్.కే. దయాసాగర్, సామల రాము, బీఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి, కాంట్రాక్టర్ శంకర్, సంఘం వ్యవస్థాపక సభ్యులు దేవయ్య, యాదగిరి, నరసింహ, మాచర్ల భద్రయ్య, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో సంస్థాగత బలోపేతంపై దృష్టి

– కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు
– ప్రతి గడపకు కాంగ్రెస్ అనే నినాదంతో ముందుకు

ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్--299లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
సమావేశంలో డివిజన్‌లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. ప్రతి బూత్‌కు నూతన కమిటీలను ఏర్పాటు చేసి, కమిటీలకు అధ్యక్షులను నియమించి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని నాయకులు నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్‌లో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ప్రతి గడపకు కాంగ్రెస్ జెండా, అజెండాను తీసుకెళ్లాలని అన్నారు. గత పదేళ్ల పాలనలో స్థానిక ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు లభించేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి సైతం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ సంస్థాగత నిర్మాణమే ఎన్నికల్లో పార్టీ విజయానికి కీలకమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. డివిజన్‌లో బూత్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ కావాలని కోరారు. సమావేశంలో మాజీ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, డిసిసి ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, మేడ్చల్ డివిజన్ అధ్యక్షుడు చాపరాజు, రేగురాజు, మాజీ కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, అను బంధ సంఘాల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీ టీసీలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, సీని యర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన భూములకు రిజిస్ట్రేషన్లు

– 22/ఎ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం..
– ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలి.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు
– క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన అధికారులు
– 'మా భూమి మాకు దక్కింది.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అంటున్న దరఖాస్తుదారులు

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : 22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టింది. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతో రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించకుండా, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.
బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు.

– ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలి

అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని స్పష్టం చేశారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు చేరింది, అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి, ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి, హక్కుదారుల వద్ద ఉన్న పత్రాలు ఏమిటి, గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు వంటి అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని భూముల విషయంలో అందుకు గల కారణాలను దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు 22/ఎ భూముల విషయంలో ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

– 'నా భూమి నాకు దక్కింది.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు'

22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించడంతో ప్రత్యక్షంగా లబ్ధి పొందిన పోచారం గ్రామానికి చెందిన రాకేష్ తన అనుభవాన్ని వెల్లడించారు. 2022లో పోచారం గ్రామంలో 100 గజాల స్థలం కొనుగోలు చేశానని, ఇటీవల విక్రయించేందుకు నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినప్పుడు తన భూమి 22/ఎలో ఉందని చెప్పడంతో ఆందోళనకు గురయ్యానని తెలిపారు. అయితే కొద్ది రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి భూమికి ఎలాంటి సమస్య లేదని సమాచారం ఇచ్చారని, దీంతో కొనుగోలుదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నానని చెప్పారు. సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

– క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు

నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ సునీల్ మాట్లాడుతూ.. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గత ఏడాది డిసెంబర్‌లో 22/ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. తాజాగా కలెక్టర్ నుంచి క్లియరెన్స్ రావడంతో గతంలో రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించిన వారికి ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నామని, వారు కార్యాలయానికి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నామని వివరించారు.

– అడ్డగుట్ట సొసైటీలో 300 ప్లాట్లకు విముక్తి

కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని 300 ప్లాట్లకు 22/ఎ నిషేధిత జాబితా నుంచి విముక్తి లభించిందని కొనుగోలుదారు చక్రపాణి తెలిపారు. నెల రోజుల క్రితం సొసైటీలోని 80సీలో 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడు 22/ఎలో ఉందని చెప్పడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. తాజాగా ప్రభుత్వ చర్యలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నానని చెప్పారు. తమ సొసైటీలోని సుమారు 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారని, దీనిపై సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

– వారం రోజుల్లోనే సమస్య పరిష్కారం

మూసాపేటలోని రెయిన్‌బో విస్టాలో ప్లాట్ నంబర్ 804ను విక్రయించేందుకు ప్రయత్నించిన వెంకట విజయ్‌కుమార్‌కు 22/ఎ కారణంగా రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. ఆయన ఆస్ట్రేలియా వెళ్లే సమయంలో తన మామ రాజేంద్రప్రసాద్‌కు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈ నెల 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో రాజేంద్రప్రసాద్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు.
ప్రభుత్వం సకాలంలో స్పందించడంతో వారం రోజుల్లోనే సమస్య పరిష్కారమైందని, రిజిస్ట్రేషన్ సంతృప్తికరంగా పూర్తయిందని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

– 2005 నుంచి ఎదురుచూపులు.. ఎట్టకేలకు రిజిస్ట్రేషన్

మూసాపేటలోని వైష్ణవి ఎస్టేట్స్ ప్రతినిధి శ్రీనివాస్ కూడా 22/ఎ సమస్య నుంచి విముక్తి పొందారు. సర్వే నంబర్ 108లోని భూమికి 2005లోనే సీలింగ్ పర్మిషన్ వచ్చిందని, అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రెండు వారాల క్రితం బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లినప్పుడు భూమిని 22/ఎలో చేర్చినట్లు అధికారులు చెప్పారని, కలెక్టర్‌ను ఆశ్రయించిన అనంతరం తాజాగా క్లియరెన్స్ వచ్చిందన్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నామని తెలిపారు.

– పలు సర్వే నంబర్లపై నిషేధం తొలగింపు

బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని సర్వే నంబర్లు 101/1, 101/2, 102, 108, 109, 112, 81లో సుమారు 3,000 చదరపు మీటర్ల స్థలంపై ఉన్న 22/ఎ నిషేధాన్ని తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఆయా సర్వే నంబర్లలోని భూములకు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సబ్ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు.

– అధికారుల ఆదేశాలతో వెంటనే రిజిస్ట్రేషన్

గుండ్లపోచంపల్లిలోని ఏజీ కాలనీలో గౌరీశంకర్ వద్ద కొనుగోలు చేసిన ప్లాట్‌ను జూలై 6న రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెళ్లగా 22/ఎ నిషేధిత జాబితా కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందని ఓ దరఖాస్తుదారు తెలిపారు. అప్పటి నుంచి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, తాజాగా డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలతో సబ్ రిజిస్ట్రార్ వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారని చెప్పారు. 22/ఎ అంశంలో అర్హత ఉన్న భూములకు వేగంగా క్లియరెన్స్ ఇచ్చి రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తుండటంతో దరఖాస్తుదారుల్లో ఉపశమనం వ్యక్తమవుతోంది.

గచ్చిబౌలి హాకీ స్టేడియానికి ప్రతిష్టాత్మక ఎఫ్ఐహెచ్ కేటగిరీ--1 ధ్రువీకరణ

– దేశంలోనే తొలి, ఏకైక కేటగిరీ--1 ఆస్ట్రోటర్ఫ్ హాకీ మైదానంగా గుర్తింపు
– అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మైదానం, లైటింగ్, ఆటగాళ్ల భద్రతా సదుపాయాలు
– 2029 ఫిబ్రవరి 26 వరకు ధ్రువీకరణ అమల్లో



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: గచ్చిబౌలి హాకీ కాంప్లెక్స్ స్టేడియానికి అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రతిష్టాత్మక కేటగిరీ--1 హాకీ ఫీల్డ్ ధ్రువీకరణ లభించింది. దీంతో దేశంలోనే తొలి, ఏకైక కేటగిరీ--1 ఆస్ట్రోటర్ఫ్ హాకీ మైదానంగా గచ్చిబౌలి స్టేడియం ప్రత్యేక గుర్తింపు పొందింది. అంతర్జాతీయ హాకీ పోటీల నిర్వహణకు అవసరమైన అత్యున్నత ప్రమాణాలను స్టేడియం అందుకుంటుందా లేదా అనే అంశంపై ఎఫ్ఐహెచ్ నిపుణులు విస్తృతంగా పరీక్షలు నిర్వహించారు. మైదానం నాణ్యత, బంతి కదలిక, ఉపరితల సమతుల్యత, మైదానం కొలతలు, లైన్ మార్కింగ్‌లు, నీటి పారుదల వ్యవస్థ, ఆటగాళ్ల భద్రత, హాకీ గోల్స్, జట్లు--అధికారుల సదుపాయాలు, పరిధి కంచె, ప్రేక్షకుల వసతులతో పాటు అంతర్జాతీయ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.
ఈ పరీక్షల్లో స్టేడియంలోని అన్ని సదుపాయాలు నిర్దేశిత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు ఎఫ్ఐహెచ్ ధ్రువీకరించింది.

– అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా టర్ఫ్

గచ్చిబౌలి హాకీ స్టేడియంలోని హాకీ టర్ఫ్ ఎఫ్ఐహెచ్ ఆమోదించిన గ్లోబల్ కేటగిరీ ఉత్పత్తి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు నాణ్యతా పరీక్షల్లో వెల్లడైంది. టర్ఫ్ తయారీ లేదా ఏర్పాటు విషయంలో ఎలాంటి లోపాలు లేవని, బంతి కదలిక, ఆటతీరును ప్రభావితం చేసే సమస్యలు గుర్తించలేదని పరీక్షా నివేదిక పేర్కొంది. మైదానం నాణ్యత, ఆటతీరు, ఆటగాళ్ల భద్రత, మన్నిక వంటి అంశాలతో పాటు అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌ల నిర్వహణలో కీలకమైన ఫీల్డ్ లైటింగ్‌ను కూడా ఎఫ్ఐహెచ్ ప్రత్యేకంగా పరీక్షించింది. కేటగిరీ--1 మైదానానికి అవసరమైన టివి3 స్థాయి లైటింగ్ ప్రమాణాలను గచ్చిబౌలి స్టేడియం అందుకుంటున్నట్లు నిర్ధారించింది.

– 2029 వరకు ధ్రువీకరణ

ఎఫ్ఐహెచ్ కేటగిరీ--1 ధ్రువీకరణ 2029 ఫిబ్రవరి 26 వరకు అమల్లో ఉంటుంది. ఈ గుర్తింపుతో గచ్చిబౌలి హాకీ స్టేడియం అంతర్జాతీయ స్థాయి హాకీ పోటీల నిర్వహణకు మరింత అనుకూలమైన వేదికగా నిలిచింది.
ఇటీవల మార్చి 8 నుంచి 13 వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మహిళల హాకీ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల నేపథ్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సమన్వయంతో నిరంతరం కృషి చేశారు. రికార్డు సమయంలో మైదానాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన ఫలితంగా తాజాగా ఎఫ్ఐహెచ్ కేటగిరీ--1 ధ్రువీకరణ లభించింది. ఈ ధ్రువీకరణతో గచ్చిబౌలి హాకీ స్టేడియం సామర్థ్యం మరింత బలోపేతమై, భవిష్యత్‌లో మరిన్ని ప్రతిష్టాత్మక అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్లకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఏర్పడింది.

సంజీవయ్య పార్కులో మల్టీమీడియా లేజర్ షో.. ప్రజలకు అందుబాటులోకి

– వాటర్ స్క్రీన్, మ్యూజికల్ ఫౌంటెన్‌తో ఆకట్టుకునే వినోదం
– రూ.49.65 కోట్లతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
– సాయంత్రం 7, 8 గంటలకు రెండు షోలు.. పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.120

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: నగర ప్రజలు, పర్యాటకులకు సరికొత్త వినోద అనుభూతిని అందించేందుకు సంజీవయ్య పార్కులో ఏర్పాటు చేసిన మల్టీమీడియా లేజర్ షో, వాటర్ స్క్రీన్, మ్యూజికల్ ఫౌంటెన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీ టీడీసీ) ఆధ్వర్యంలో ఈ ఆకర్షణీయమైన ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సహకారంతో మొత్తం రూ.49.65 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. హైదరాబాద్‌ను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మరింత ప్రోత్సహించడంతో పాటు నగరానికి వచ్చే పర్యాటకులు, స్థానికులకు ప్రపంచస్థాయి వినోద అనుభూతిని అందించడం దీని ప్రధాన ఉద్దేశమని టీజీటీడీసీ తెలిపింది.

– రోజూ రెండు షోలు

సంజీవయ్య పార్కులో మల్టీమీడియా షోను ప్రతి రోజూ రెండు విడతల్లో నిర్వహించనున్నారు.
- మొదటి షో: రాత్రి 7:00 నుంచి 7:30 గంటల వరకు
- రెండో షో: రాత్రి 8:00 నుంచి 8:30 గంటల వరకు

– టికెట్ ధరలు

- పెద్దలు: ఒక్కొక్కరికి రూ.150
- 5 నుంచి 12 ఏళ్ల పిల్లలు: ఒక్కొక్కరికి రూ.120

లేజర్ కాంతులతో రూపొందించే అద్భుతమైన దృశ్యాలు, నీటి తెరపై ప్రదర్శించే ఆకట్టుకునే విజువల్స్, సంగీతానికి అనుగుణంగా సమన్వయంతో సాగించే మ్యూజికల్ ఫౌంటెన్ ఈ షోలో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

– కుటుంబాలతో సందర్శించేందుకు ప్రత్యేక ఆకర్షణ

కుటుంబాలు, చిన్నారులు, నగరానికి వచ్చే పర్యాటకులు సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా గడిపేందుకు ఈ మల్టీమీడియా వినోద ప్రదర్శనను రూపొందించారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సంజీవయ్య పార్కులో ఒకే వేదికపై లేజర్ ప్రొజెక్షన్లు, వాటర్ స్క్రీన్ విజువల్స్, సంగీత ఫౌంటెన్‌ను వీక్షించే అవకాశం కల్పించారు. ఈ వినూత్న పర్యాటక ఆకర్షణను సందర్శించి ప్రత్యేకమైన మల్టీమీడియా వినోద అనుభూతిని ఆస్వాదించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రజలు, పర్యాటకులకు ఆహ్వానం పలికింది.
మరిన్ని వివరాలకు:
9848126947
9848125720
9848306435
8340811234

తెలంగాణలో బ్యాంకుల రుణాలు రూ.12.76 లక్షల

- మొదటి త్రైమాసికంలో ఎంఎస్ఎంఈలకు రూ.91,374 కోట్ల రుణాలు
- వ్యవసాయ రంగానికి రూ.52,337 కోట్లు.. బ్యాంకులు తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణలో బ్యాంకింగ్ రంగం తొలి త్రైమాసికంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రాష్ట్రంలోని బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.49,522 కోట్లు పెరిగి రూ.9,92,947 కోట్లకు చేరగా, మొత్తం రుణాలు రూ.42,891 కోట్లు పెరిగి రూ.12,76,748 కోట్లకు చేరాయి. క్రెడిట్-డిపాజిట్ (సీడీ) నిష్పత్తి 128.58 శాతంగా నమోదైంది.తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) 50వ త్రైమాసిక సమీక్ష సమావేశం బుధవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాం కులు, ఆర్ఆర్‌బీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- ప్రాధాన్య రంగాలకు రూ.1.46 లక్షల కోట్ల రుణాలు
2026--27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బ్యాంకులు వివిధ ప్రాధాన్య రంగాలకు చెందిన రుణగ్రహీతలకు కలిపి రూ.1,46,096 కోట్ల రుణాలు అందించాయి. ఇది వార్షిక లక్ష్యంలో 33.66 శాతం సాధించినట్లుగా ఎస్ఎల్‌బీసీ సమావేశంలో వెల్లడించారు.
వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక ఉత్పత్తి రుణాల కింద రూ.20,069 కోట్లు పంపిణీ చేసి ఖరీఫ్ లక్ష్యంలో 34.51 శాతం సాధించారు. వ్యవసాయ అనుబంధ, వ్యవసాయ మౌలిక వసతులు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు పెట్టుబడి రుణాలుగా రూ.32,268 కోట్లు అందించారు. ఇది వార్షిక లక్ష్యంలో 38.36 శాతానికి సమానం.
ప్రాధాన్య రంగంలో విద్యా రుణాలుగా రూ.134 కోట్లు, గృహ రుణాలుగా రూ.1,402 కోట్లు పంపిణీ చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి రూ.91,374 కోట్లు రుణాలు అందించి వార్షిక లక్ష్యంలో సుమారు 40 శాతం సాధించారు.

- తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు పనిచేయాలి
సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్--2047 విజన్‌కు అనుగుణంగా బ్యాంకులు తమ కార్యకలాపాలను రూపొందించుకోవాలని కోరారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యాలకు బ్యాంకింగ్ రంగం సహకరించాలని సూచించారు.
బ్యాంకుల పనితీరును కేవలం రుణ లక్ష్యాల సాధనతోనే కాకుండా గ్రామీణ ఆదాయాల పెరుగుదల, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన వంటి ఫలితాల ఆధారంగా కూడా అంచనా వేయాలని అన్నారు.
వ్యవసాయ రంగానికి రూ.52,337 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.91,374 కోట్ల రుణాల పంపిణీపై సమీక్షించిన భట్టి విక్రమార్క.. వ్యవసాయ రుణాల్లో అధిక నిరర్థక ఆస్తులపై (ఎన్‌పీఏ) ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, ఎంఎస్ఎంఈలకు సకాలంలో, చురుకైన రుణ సహాయం అందించాలని బ్యాంకులను కోరారు.క్రియాశీలంగా లేని బిజినెస్ కరస్పాండెంట్లను (బీసీలు) తిరిగి పనిచేసేలా చూడాలని, స్వయం సహాయక సంఘాలకు సంక్షేమ ఆధారిత ఆర్థిక సహాయం నుంచి వ్యాపార, పారి శ్రామిక కార్యకలాపాలకు అవసరమైన రుణాల వైపు దృష్టి మళ్లించాలని సూచించారు.మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో తెలంగాణ దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా ఎదుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు.

- 13 శాతం వృద్ధికి బ్యాంకులు సహకరించాలి
రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ తెలంగాణ విజన్-2047 సాధనలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్ర విజన్‌కు అనుగుణంగా వార్షిక రుణ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.
ప్రస్తుతం రాష్ట్రం 10-11 శాతం వృద్ధి రేటుతో కొనసాగుతోందని, భవిష్యత్‌లో 13 శాతం వృద్ధి రేటు సాధించేందుకు బ్యాంకులు మరింత లక్ష్యబద్ధంగా రుణాలు అందించాలని ఆయన కోరారు.

- గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించాలి
ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ మాట్లాడుతూ.. సవరించిన లీడ్ బ్యాంక్ పథకం నిబంధనల ప్రకారం ప్రతి బ్యాంకు జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశాలకు ప్రాతినిధ్యం వహించేందుకు నిర్దిష్ట సీనియర్ అధికారిని నియమించాలని సూచించారు.
రుణాలు వినియోగించే ప్రాంతం ఆధారంగా సీడీ నిష్పత్తిని నివేదించాలని, నివేదికల్లో కచ్చితత్వం పాటించాలని బ్యాంకులను కోరారు. క్రియాశీలంగా లేని బిజినెస్ కరస్పాండెంట్లపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు బ్యాంకింగ్ సేవలు అందని రెవెన్యూ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు.
అవసరమైన చోట స్థిరమైన బీసీలను నియమించాలని, నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ 2025-30 లక్ష్యాలకు అనుగుణంగా దశలవారీగా మహిళా బీసీల సంఖ్యను పెంచాలని అన్నారు.గుర్తించిన ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో పనిచేస్తున్న సంస్థల డేటాబేస్‌ను రూపొందించి, అర్హత కలిగిన అన్ని ఎంఎస్ఎంఈలకు అధికారిక సంస్థాగత రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని చిన్మయ్ కుమార్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఖాతాల రీకేవైసీని వేగవంతం చేయడంతో పాటు క్లెయిమ్ చేయని డిపాజిట్ల పరిష్కారాన్ని మెరుగుపరచాలని కోరారు.

- ఆర్థిక చేర్పులోనూ పురోగతి
రాష్ట్రంలోని బ్యాంకుల్లో 133.57 లక్షల ప్రధానమంత్రి జనధన్ యోజన ఖాతాలు ఉన్నాయని సమావేశంలో వెల్లడించారు. వీటిలో 112.44 లక్షల ఖాతాలు, అంటే 84.18 శాతం ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమయ్యాయి. 92.36 లక్షల ఖాతాలకు రూపే కార్డులు జారీ చేశారు.సామాజిక భద్రతా పథకాలలో భాగంగా 206.73 లక్షల మంది ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన , 109.52 లక్షల మంది ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజలో చేరారు. మరో 28.99 లక్షల మంది అటల్ పెన్షన్ యోజనలో సభ్యత్వం పొందారు.
ఎస్ఎల్‌బీసీ తెలంగాణ చైర్మన్, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం నీలేష్ ద్వివేది బ్యాంకుల పనితీరు వివరాలను సమర్పించారు. సమావేశంలో సెర్ప్ సీఈఓ డి. దివ్య, కేంద్ర ఆర్థిక సేవల విభాగం డైరెక్టర్ మనసా గంగోత్రి కటా, నాబార్డ్ సీజీఎం బి. ఉదయ్ భాస్కర్ తదితరులు ప్రసంగించారు. ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్ పాల్గొనగా, డీజీఎం జ్ఞానేశ్వర్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రూ.9,450 కోట్లతో 410 కి.మీ. రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం.. ఏపీ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ప్రయోజనం

ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశంలో రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 8 జిల్లాల పరిధిలో చేపట్టనున్న నాలుగు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులను 2030--31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- నాలుగు ప్రాజెక్టులు ఇవే..

ఖరగ్‌పూర్--భద్రక్ (రనిటాల్) నాలుగో లైన్ -- 173 కి.మీ. (పశ్చిమ బెంగాల్, ఒడిశా)
భద్రక్--హరిదాస్‌పూర్ నాలుగో లైన్ -- 75 కి.మీ. (ఒడిశా)
గుమ్మిడిపుండి--గూడూరు మూడో, నాలుగో లైన్లు -- 90 కి.మీ. (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు)
కటక్--పారాదీప్ (బడబంధ) మూడో, నాలుగో లైన్లు -- 72 కి.మీ. (ఒడిశా)
ఈ ప్రాజెక్టులతో మొత్తం దాదాపు 410 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగనుంది. రైళ్ల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రస్తుతం ఉన్న మార్గాలపై ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. రైల్వే రవాణా సామర్థ్యం, సేవల విశ్వసనీయత మరింత మెరుగుపడుతుందని కేంద్రం పేర్కొంది.

- 6,448 గ్రామాలకు మెరుగైన అనుసంధానం
నాలుగు రాష్ట్రాల్లోని సుమారు 6,448 గ్రామాలకు ఈ ప్రాజెక్టుల ద్వారా మెరుగైన రైలు కనెక్టివిటీ అందనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలకు దీని ప్రయోజనం చేకూరనుంది. ప్రాజెక్టుల నిర్మాణం, సంబంధిత ఆర్థిక కార్యకలాపాల ద్వారా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని కేంద్రం తెలిపింది.'పీఎం గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక'కు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను రూపొందించారు. బహువిధ రవాణా అనుసంధానం, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచడం, ప్రజలు--సరుకులు--సేవల రవాణాను వేగవంతం చేయడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

- ఏపీకి కీలక ప్రయోజనం
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని గుమ్మిడిపుండి--గూడూరు మార్గంలో 90 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్గం ద్వారా ప్రయాణికుల రైళ్లతో పాటు పారిశ్రామిక, వాణిజ్య సరకు రవాణాకు అదనపు సామర్థ్యం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

- పర్యాటక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ

మల్టీట్రాకింగ్ ప్రాజెక్టుల ద్వారా పలు ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు అనుసంధానం మెరుగుపడనుంది. కుల్దిహా వన్యప్రాణుల అభయారణ్యం, భితరకనిక జాతీయ పార్కు, భద్రకాళీ దేవాలయం, పంచలింగేశ్వర ఆలయం, చాందీపూర్ బీచ్, తాల్సరి--ఉదయ్‌పూర్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, వీరరాఘవ పెరుమాళ్ ఆలయం, జగన్నాథాలయం, సరళా ఆలయం, ధబలేశ్వర్ ఆలయం, లలిత్‌గిరి వంటి ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

- 76 మిలియన్ టన్నుల అదనపు సరకు రవాణా
ఈ రైల్వే మార్గాల సామర్థ్యం పెరగడంతో ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల సరకు రవాణా చేసే అవకాశం ఏర్పడనుంది. బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంటు, ఇనుము--ఉక్కు, కంటైనర్లు, వాహనాలు, ఆహార ధాన్యాల రవాణాకు ఈ మార్గాలు మరింత ఉపయోగకరంగా మారనున్నాయి.రైల్వే ద్వారా సరకు రవాణా పెరగడం వల్ల ఇంధన వినియోగం, రవాణా వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణానికి కూడా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టుల వల్ల దాదాపు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది. అలాగే సుమారు 65 కోట్ల కిలోల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు తగ్గనున్నాయి. ఇది దాదాపు 2.60 కోట్ల మొక్కలు నాటడం ద్వారా లభించే పర్యావరణ ప్రయోజనానికి సమానమని కేంద్రం పేర్కొంది.

నరాల బలహీనతకు దారితీసే 'మల్టిపుల్ స్క్లెరోసిస్', మీ బాడీలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో చెప్పిన డాక్టర్!

చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, స్పర్శ కోల్పోవడం లేదా సూదులతో గుచ్చినట్లు అనిపిస్తోందా? కంటి చూపు మసకబారడం లేదా ఒకే వస్తువు రెండుగా కనిపించడం జరుగుతోందా? అయితే, మీరు మల్టిపుల్ స్క్లెరోసిస్‌తో బాధపడుతున్నారని అర్థం. మల్టిపుల్ స్క్లెరోసిస్ అంటే ఏంటి, ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో తెలుసుకుందాం.మల్టిపుల్ స్క్లెరోసిస్ అనేది నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక ఆటోఇమ్యూన్ వ్యాధి. మన శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున మెదడు, వెన్నుపాము, కంటిలోని నరాల చుట్టూ ఉండే రక్షణ పొర పై దాడి చేయడం వల్ల ఇది వస్తుంది. దీనివల్ల మెదడు నుంచి శరీరంలోని ఇతర భాగాలకు సంకేతాలు చేరడంలో అంతరాయం ఏర్పడి, అనేక రకాల శారీరక సమస్యలు తలెత్తుతాయి. సాధారణంగా 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువ. పిల్లలు, వృద్ధులలో రావడం చాలా అరుదు. కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే ఇతరులకు వచ్చే ప్రమాదం స్వల్పంగా పెరుగుతుంది. మల్టిపుల్ స్క్లెరోసిస్ లక్షణాలు, రావడానికి కారణాలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు ఇలా పూర్తి సమాచారాన్ని డాక్టర్ లోకేష్ బి (సీనియర్ కన్సల్టెంట్ -- న్యూరాలజీ, ఆస్టర్ సిఎంఐ హాస్పిటల్, బెంగళూరు) అందించారు. ఆ పూర్తి వివరాలేంటో ఇప్పుడు చుద్దాం.దీని ప్రారంభ లక్షణాలు ఎలా ఉంటాయి?నాడీ వ్యవస్థలోని ఏ భాగం ప్రభావితమైందనే దానిపై ఆధారపడి ఒక్కొక్కరిలో ఒక్కోలా లక్షణాలు కనిపిస్తాయి.
?కంటి చూపు మసకబారడం లేదా ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డబుల్ విజన్).కంటిని కదిలించినప్పుడు నొప్పి రావడం.చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, స్పర్శ కోల్పోవడం లేదా సూదులతో గుచ్చినట్లు అనిపించడం.కండరాల బలహీనత, శరీర సమతుల్యత కోల్పోవడం, నడవడంలో ఇబ్బంది.విపరీతమైన అలసట, తలతిరగడం.మెడను ముందుకు వంచినప్పుడు వెన్నుపాము లేదా కాళ్లలోకి కరెంట్ షాక్ కొట్టినట్లు అనిపించడం ఈ లక్షణాలు ఒక్కసారిగా వచ్చి, తగ్గి, మళ్లీ కొన్ని రోజుల తర్వాత కనిపించవచ్చు.ఈ వ్యాధి రావడానికి ఖచ్చితమైన కారణం ఇంకా పూర్తిగా తెలియలేదు. జన్యుపరమైన, పర్యావరణ కారకాల కలయిక వల్ల రోగనిరోధక వ్యవస్థలో వచ్చే లోపాలే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.
ఇది నేరుగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే వంశపారంపర్య వ్యాధి కాదు. అయితే కుటుంబంలో ఎవరికైనా ఉంటే స్వల్ప రిస్క్ ఉండొచ్చు.విటమిన్ డి లోపం, కొన్ని



రకాల వైరల్ ఇన్ఫెక్షన్లు (ఉదా: ఎప్స్టీన్-బార్ వైరస్), ధూమపానం, ఊబకాయం మీ వ్యాధిని పూర్తిగా నయం చేయడానికి నిర్దిష్టమైన మందులు లేనప్పటికీ, సరైన చికిత్స ద్వారా వ్యాధి తీవ్రతను, దాడుల్ని అదుపు చేయవచ్చు.లక్షణాల ఆధారిత మందులు: కండరాల బిగుతు, నొప్పి, అలసట, మూత్రాశయ సమస్యలు, డిప్రెషన్‌ను తగ్గించే మందులు ఇస్తారు.థెరపీలు: ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీల ద్వారా రోగి సొంతంగా పనులు చేసుకునేలా చేయవచ్చు.మీ ఉన్నవారు సాధారణ జీవితాన్ని గడపొచ్చా?
తప్పకుండా. సరైన చికిత్స, జీవనశైలి మార్పుల ద్వారా రోగులు చురుకైన, సాధారణ జీవితాన్ని గడపొచ్చు.
న్యూరాలజిస్ట్‌ను క్రమం తప్పకుండా సంప్రదించడం, వేళకు మందులు వాడటం ముఖ్యం.
ఒత్తిడి తగ్గించుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా లక్షణాలు తిరగబెట్టకుండా చూసుకోవచ్చు.
కుటుంబం, సమాజం ఇచ్చే మానసిక మద్దతు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.
ఆహార, వ్యాయామ నియమాలు ఏంటి?
?ఆహారం: పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు ఉండే ప్రోటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ డి పుష్కలంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవాలి. తగినంత నీరు తాగాలి.
వ్యాయామం: వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, యోగా, తేలికపాటి స్ట్రెచింగ్ వ్యాయామాలు కండరాల బలాన్ని పెంచి అలసటను తగ్గిస్తాయి. శరీర శక్తిని బట్టి వ్యాయామాలను ఎంచుకోవాలి.
ఎండ వేడిమి ప్రభావం: మీ రోగులకు శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు (ఎండలో తిరగడం, వేడి నీటి స్నానం వల్ల) లక్షణాలు తాత్కాలికంగా ఎక్కువవుతాయి. కాబట్టి చల్లని వాతావరణంలో ఉండటానికి ప్రయత్నించాలి.
వ్యాధి నిర్ధారణ లక్షణాలు కనిపించిన వెంటనే మెదడు, వెన్నుపాముకు సంబంధించిన స్కాన్, అవసరమైతే జూఖీ (స్పైనల్ ఫ్లూయిడ్) టెస్ట్ చేయించడం ద్వారా వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించవచ్చు.

నరాల బలహీనత తగ్గించే ఫూల్ మఖానా డ్రై రోస్ట్.. ఇంట్లో సులభంగా తయారు చేసుకునే పద్ధతి!

నరాలు ఆరోగ్యంగా ఉండటం అంటే కేవలం చేతులు, కాళ్లలో బలం ఉండటమే కాదు.. మెదడు నుంచి శరీరంలోని ప్రతి భాగానికి సంకేతాలు సక్రమంగా చేరడం, కండరాలు సరిగ్గా పనిచేయడం, స్పర్శను గుర్తించడం వంటి ఎన్నో ప్రక్రియలు నాడీ వ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. అందుకే నరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ ఆహారంలో అవసరమైన పోషకాలు ఉండేలా చూసుకోవడం ముఖ్యం. మఖానా మన డైట్‌లో చేర్చుకుంటే నరాలు ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.. మెదడు నుంచి శరీరంలోని ప్రతి భాగానికి సంకేతాలను చేరవేయడంలో నరాలు కీలక పాత్ర పోషిస్తాయి. మెదడు నుంచి చేతులు, కాళ్లు, కండరాలు, ఇతర అవయవాలకు సంకేతాలను చేరవేయడం నుంచి స్పర్శ, కదలికలను నియంత్రించడం, శరీరంలోని అనేక విధులు సక్రమంగా సాగడం కూడా నాడీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే నరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం.
ఈ విషయంలో మఖానా (ఫాక్స్‌నట్స్/లోటస్ సీడ్స్) ఆరోగ్యకరమైన స్నాక్‌గా ఉపయోగపడవచ్చని రీసెర్చ్‌గేట్ అధ్యయనం పేర్కొంది. మఖానాలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా మెగ్నీషియం నరాలు, కండరాల సాధారణ పనితీరులో సహాయపడుతుంది. అంతేకాదు మఖానాలో కొన్ని యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. మరి ఫూల్ మఖానా డ్రై రోస్ట్‌ని ఎలా తయారు చేసుకోవాలి? దీన్ని రోజువారీ ఆహారంలో ఎలా చేర్చుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం.మఖానాలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. శరీరంలో నరాల సంకేతాలు సక్రమంగా పనిచేయడానికి, కండరాల సాధారణ కదలికలకు మెగ్నీషియం అవసరం. కాబట్టి రోజువారీ ఆహారంలో మెగ్నీషియం తగినంతగా ఉండటం నాడీ వ్యవస్థ సాధారణ పనితీరుకు సహాయపడుతుంది. మీ డైట్‌లో మఖానా చేర్చుకుంటే మెగ్నీషియంలో లోపం తలెత్తదు.మఖానాలో కొంత ప్రోటీన్ కూడా లభిస్తుంది. శరీరంలోని కణాల నిర్మాణం, వాటి నిర్వహణ, మరమ్మతు వంటి అనేక ప్రక్రియలకు ప్రోటీన్ అవసరం. నరాల ఆరోగ్యానికి కూడా మొత్తం శరీరానికి సరిపడే ప్రోటీన్ అందడం చాలా ముఖ్యం. అందుకే మీ డైట్‌లో మఖానా తీసుకుంటే శరీరానికి కొంతమేర ప్రోటీన్ కూడా అందుతుంది.మఖానాలో కొన్ని మొక్కల ఆధారిత యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ వల్ల కణాలకు నష్టం కలగవచ్చు. యాంటీఆక్సిడెంట్లు ఇలాంటి ప్రక్రియలను నియంత్రించడంలో సహాయపడతాయి. అందువల్ల మఖానాను కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ఇతర గింజలతో కూడిన వైవిధ్యమైన ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు.
కావల్సిన పదార్థాలు: ఫూల్ మఖానా 2 కప్పులు, నెయ్యి లేదా ఆలివ్

ఆయిల్ - 1 చిన్న స్పూన్, పసుపు చిటికెడు, ఉప్పు తగినంత, కారం, చాట్ మసాలా- అర టీ స్పూన్. మఖానాను స్నాక్‌గా తీసుకోవాలనుకుంటే తక్కువ నూనెతో డ్రై రోస్ట్ చేయడం మంచి పద్ధతి. రుచికి కొద్దిగా మిరియాల పొడి, జీలకర్ర పొడి, ఇతర మసాలాలు కలుపుకోవచ్చు. ఉప్పును మాత్రం ఎక్కువగా వేయకపోవడం మంచిది. ఎక్కువ నూనె, వెన్న, ఉప్పుతో తయారుచేసిన మఖానా ఆరోగ్యానికి అంత మంచిది కాదు. మఖానాను బ్రేక్‌ఫాస్ట్‌గా కూడా తీసుకోవచ్చు.స్టవ్ మీద పాన్ పెట్టి మీడియం మంటపై ఫూల్ మఖానాను నూనె లేకుండా దోరగా వేయించాల. మఖానా క్రిస్పీగా అయిన తర్వాత ఒక స్పూన్ నెయ్యి లేదా ఆలివ్ ఆయిల్ వేసి తక్కువ మంటపై ఉంచి పసుపు, ఉప్పు, కారం, మిరియాలు, జీలకర్ర పొడి వేసి మఖానాకు బాగా పట్టేలా బాగా కలపాలి. చివరిగా కొంచెం చాట్ మసాలా వేసి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇవి బాగా చల్లారిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు. మీకు అవసరమైనప్పుడల్లా వీటిని రకరకాల కాంబినేషన్లతో కలుపుకుని తినొచ్చు.నరాల ఆరోగ్యం కోసం మఖానా ఒక్కటే సరిపోదు. విటమిన్ డీ12, డీ6, ఫోలేట్, మెగ్నీషియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి పోషకాలు కూడా నాడీ వ్యవస్థ సాధారణ పనితీరులో చాలా ముఖ్యం. అందువల్ల ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గింజలు, పాల ఉత్పత్తులు, అవసరాన్ని బట్టి ఇతర పోషకాహారాలను ఆహారంలో చేర్చుకోవాలి. అలాగే తగినంత నిద్ర, క్రమం తప్పకుండా శారీరక చురుకుదనం, పొగతాగకుండా ఉండటం వంటి జీవనశైలి అలవాట్లు కూడా మొత్తం నాడీ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.ముఖ్య గమనిక: ఈ కథనంలోని సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, కొందరు నిపుణులు పేర్కొన్న అంశాల ఆధారంగా తెలియజేశాము. వీటిని ఎంత వరకు విశ్వసించాలనేది, పాటించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం. సమయం తెలుగు వీటిని ధృవీకరించడం లేదు.

ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపల్ హత్య కేసులో బిగ్‌ట్విస్ట్‌హత్య చేసింది పదో తరగతి విద్యార్థులే

నల్గొండ జిల్లా: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీకి చెందిన నాగార్జున పబ్లిక్? స్కూల్? ప్రిన్సిపల్? కె.రూపారెడ్డి, ఈ నెల 11న దారుణ హత్యకు గురయ్యారు. ఇద్దరు పదో తరగతి విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. సుమారు 80 మందిని విచారించిన అనంతరం, కొండమల్లేపల్లి మండలంలోని రెండు తండాలకు చెందిన విద్యార్థులు ఈ ఘాతుకానికి పాల్పడారని పోలీసులు గుర్తించారు.ఆ రాత్రి ఏం జరిగిందంటే? : పదో తరగతి విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఇద్దరు పదో తరగతి విద్యార్థులు హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. మాస్క్?, హుడీ ధరించి ఈనెల 11న రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డిని డబ్బులు ఇవ్వాలని బెదిరించగా ఆమె ప్రతిఘటించారు. ఈ క్రమంలో మాస్క్? ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి రూపారెడ్డి కేకలు పెట్టారు. దీంతో గుర్తింపు బయటపడటంతో రూపారెడ్డిని వెంట తీసుకెళ్లి కత్తితో పొడిచారు. ఇంట్లో రూ.2.20 లక్షల తీసుకుని బయట ఉన్న విద్యార్థికి రూ.40 వేలు ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు. అయితే ఇద్దరు విద్యార్థులు దొంగతనాలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో అనుమానంతో పదోతరగతి విద్యార్థిని విచారిస్తున్న సమయంలో జేబులో రూ.1.60 లక్షల నగదు గుర్తించారు. దానిపై రక్తపు మరకలు ఉండటాన్ని చూసి ప్రశ్నించడంతో విద్యార్థులు నిజాన్ని ఒప్పుకున్నారు.పూర్తి వివరాలు ఇలా : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో రూపారెడ్డి స్థానికంగా ఓ ప్రైవేట్? పాఠశాలలో ప్రిన్సిపల్?గా విధులు నిర్వర్తించేవారు. భర్త రాజేందర్? రెడ్డితో కలిసి జేబీ కాలనీలో నివాసం ఉండేవారు. అయితే రూపారెడ్డికి కుటుంబానికి హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఉంది. కుమారుడు అభినవ్ రెడ్డి హైదరాబాద్‌లో ఇంజినీరింగ్‌చదువు తున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు తరచూ హైదరాబాద్?కు వెళ్తుంటారు.గత శనివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో రూపారెడ్డి భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. భర్తకు అక్కడ పని ఉండటంతో ఆమె ఆగస్టు 11న ఉదయం ఒక్కరే కొండమల్లేపల్లికి తిరిగి వచ్చారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విధులకు హాజరయ్యారు. సాధారణంగా సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలోనే ఉండేవారని తెలుస్తోంది. ఆగస్టు 11వ తేదీన తమ ఇంటికి స్నేహితులు వస్తున్నారని చెప్పి, సాయంత్రం 5.25 గంటల సమయంలోనే పాఠశాలకు సమీపంలోని తన ఇంటికి వెళ్లారు.పలుమార్లు కాల్? చేసినా స్పందన లేదు : ఆ తర్వాత ఆమె నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందలేదు. రాత్రి సమయంలో కూడా ఆమె ఫోన్?కు పలుమార్లు ఫోన్? చేసినా స్పందించలేదు. ఆగస్టు 12న భర్త రాజేందర్?రెడ్డి రూపారెడ్డికి ఫోన్? చేయగా స్విచ్ఛాఫ్? వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన ఆయన తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి కాల్? చేసి ఇంట్లోకి వెళ్లి చూడాలని కోరారు. వారు ఇంటికి వెళ్లి ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో విషయాన్ని రాజేందర్?రెడ్డికి తెలియజేశారు. ఈ నేపథ్యంలో తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న చింతపల్లి ఎస్సై రాంమూర్తికి ఫోన్? చేసి పరిస్థితిని వివరించారు. ఎస్సై స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి పరిశీలించగా రూపారెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఆమె భర్తకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సీఎం విలాసాలకు వందల కోట్లు.. ప్రభుత్వానికి పట్టని ప్రజల పాట్లు

భీమ్‌గల్ / బాల్కొండ నియోజకవర్గం : విలాసాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. నిజామా బాద్ (జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణ అభివృద్ధి పై నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవం త్‌కు ఇప్పటికే ఒక హెలికాప్టర్ ఉండగా నెలకు రూ. 5 కోట్లకు పైగా అద్దెతో ఏకంగా రూ.111 కోట్లు వెచ్చించి అదనపు హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకోవడం ఏ రకమైన పొదుపు అని ప్రశ్నిం చారు.మనుమడి కోసం రూ.10 కోట్లతో ఫుట్ బాల్ కోర్టులు, మెస్సీ పర్యటనల పేరిట ప్రచార ఆర్భాటాలకు వందల కోట్లు, అందాల పోటీలకు 100 కోట్లు,శంషాబాద్ కనెక్టివిటీ ఉన్నప్పటికీ సొంత భూముల ధర పెరగడం కోసం కొడంగల్ నుండి శంషాబాద్ వరకు రూ.3,500 కోట్లతో 6 వరుసల రహదారిని చేపట్టడానికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ (ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి అభివృద్ధి ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని . గత కాంగ్రెస్ పాలనలో మూతపడ్డ వ్యవస్థలను తాము అధికారంలోకి వచ్చాక పునరుద్ధరిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తూ, బిల్లులు నిలిపివేసి భీమ్‌గల్ అభివృద్ధిని తిరోగమనం వైపు

తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై కీలక జీవో.. 5 షోలకు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్ :తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2ఖ/4ఖ స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది.చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హైబడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరా ళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.

ఓట్లు రద్దయినా నో టెన్షన్ రాజధానిలోని మూడు జిల్లాల్లో ఇదే పరిస్థితి

హైదరాబాద్ : క్యూర్ (హైదరాబాద్) పరిధిలోని మూడు జిల్లాల్లో దాదాపు సగం ఓట్లు రద్దయినా, నగరవాసుల్లో ఎలాంటి ఆందోళన కనిపించడం లేదు. కిందిస్థాయిలోని నేతలూ ఈ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. సమీప భవిష్యత్తులో హైదరాబాద్?లో ఎన్నికలు లేకపోవడమే అందుకు కారణం. సర్వేలో రద్దయిన ఓట్లను మళ్లీ నమోదు చేయించవచ్చనేదే వారి ప్రధాన ధీమా. మరోవైపు ముసాయిదా జాబితాలోని 71 లక్షల ఓటర్లలో 38 లక్షల మంది మ్యాపింగ్ కాని, వివరాలు సరిగాలేని ఓటర్లకు నోటీసులు ఇవ్వడంపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సోమవారమే ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా, నోటీసు ముద్రణలో జాప్యం జరిగిందని, బుధవారం నుంచి నోటీసులు పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు.50 శాతం చేరువకు : సనత్‌నగర్, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, తదితర నియోజకవర్గాల్లో ఇప్పటికే 45 శాతం ఓట్లు గల్లంతవగా, నోటీసులకు సరైన సమాధానాలు అందకపోతే మరో 5 శాతం ఓట్లు రద్దవుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తంగా అక్టోబరు 19న తుది ఓటరు

జాబితా విడుదలయ్యే నాటికి రద్దయిన ఓట్ల శాతం 37.3 శాతం నుంచి 50 శాతానికి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా : అక్టోబరు 19న తుది ఓటరు జాబితా విడుదలవనుంది. ఆ మరుసటి రోజు నుంచే కొత్తగా ఓటరు నమోదు (ఫారం-6), ఓటు రద్దు (ఫారం-7), ఓటరు కార్డులో సవరణ (ఫారం-8) అప్లికేషన్ల పరిశీలన మొదలవుతుందని, దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నగరవాసులను విజ్ఞప్తి చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలోనే వివిధ రాజకీయ పార్టీలు కాలనీల్లో ఓటరు నమోదు ప్రక్రి యను చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. నవంబరులో జీ హెచ్ఎంసీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆయా పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. ఇప్పటి నుంచే కొత్త ఓటర్ల నమోదు చేయించాలని దాదాపు అన్ని పార్టీలు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాయి.కొత్తగా ఓటరు నమోదుకూ సర్-2002 వివరాలు ! : కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకున్నా, బీఎల్వోలు అందించిన ఎన్యూమరేషన్ పత్రం తిరిగి ఇవ్వకున్నా, పొరపాటున ఏఎస్డీడీ (అనామలీస్) జాబితాలో పేరు వచ్చినా, ఫారం-6 ద్వారా ఓటరుగా దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల అధికారులు అవకాశం ఇచ్చారు. ఇందుకోసం వ్యక్తిగత వివరాలతో పాటు పుట్టిన తేదీ, ఇంటి చిరునామాను ధ్రువీకరించే అధికారిక పత్రాలు అందించాలి. అంతేకాకుండా సర్-2002 జాబితాలో పేరు ఉంటే ఆ వివరాలు తప్పకుండా నమోదు చేయాలి. లేకపోతే తండ్రి, తల్లి, తాత, నాయనమ్మల్లో ఎవరిదో ఒకరిది ఎస్?ఐఆర్-2002 వివరాలను నమోదు చేయాలి.అంటే కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలన్నా, గత సర్ వివరాలను తప్పక డిక్లరేషన్ పత్రంలో నమోదు చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలు ఈ విధానాన్ని తీవ్రంగా తప్పు పడుతున్నాయి. చాలా మంది ఓటర్లు ఆ వివరాలు లేకపోవడంతోనే ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకున్నా వివరాలు నింపి ఇవ్వలేదని, తర్వాత కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చని భావించారు. మరి ఇప్పుడు ఆ వివరాలను వారు ఎలా సమర్పిస్తారని రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసిన తర్వాతే ఓటు హక్కు కల్పించే పరిస్థితుల్లో సర్-2002 వివరాలు ఇవ్వాలన్న నిబంధనను వెనక్కి తీసుకోవాలని పార్టీలు కోరుతున్నాయి.

మాజీమంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 19 :
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు సంబంధించిన కోకాపేట్‌లోని నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది.సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు సంబంధించి హరీశ్‌రావు పిలుపునివ్వడంతో పరిస్థితిని పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్దకు పోలీసులు చేరుకోవడంతో రాజకీయ వర్గాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ వార్తతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హౌస్ అరెస్ట్..మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ

ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాదు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నడుపుతున్నడు :

హైదరాబాద్ :
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడపడం లేదని, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నడుపుతున్నాడని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి విమర్శించారు. ఈ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన సోదరులు అనుముల తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి, జగదీష్ రెడ్డి, కృష్ణా రెడ్డి, భూపాల్ రెడ్డి డైరెక్టర్‌లు ఉన్నారని అన్నారు.



ఈ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్ నగరంతోపాటు, రంగారెడ్డి జిల్లాలోని భూములను ఆక్రమించుకుంటోదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. వాళ్లు తలుచుకుంటే ఏ భూమినైనా తమ సొంతం చేసుకుంటున్నారని విమర్శించారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. భూ ఆక్రమణలకు పాల్పడుతూ సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత ముఖ్యమంత్రికి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోచారం శ్రీనివాసరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్

నిజామాబాద్ : కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎమ్మెల్యే , మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి పై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ పీఏసీ సమావేశంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు సమావేశ మందిర గేటు వద్ద శాంతియుత నిరసన చేపట్టారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను పోచారం శ్రీనివాసరెడ్డి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోచారం వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగేలా ఉన్నాయని నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ బీఫాంతో ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిపై పలు వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో

పనులు కావడం లేదని, నిధులు విడుదల చేయడం లేదని పోచారం వాపోయారు.మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి అడ్డంకులు సృష్టిస్తున్నారని పోచారం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దుమారా లేపాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కోట్లాది రూపాయాలతో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, అయితే కాంగ్రెస్‌లోకి వస్తే మరింత అభివృద్ధి చేయవచ్చనే ఆశ నీరుగారిందని ఆరోపించారు.

కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే.. మారిన బస్సు రూట్లు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అమలు చేస్తున్న వన్-వే నిబంధనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్సు రూట్లలో మార్పులు చేస్తూ, స్టాప్‌లు, స్టేజీల వివరాలను అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మారిన బస్సు రూట్లు, స్టాప్‌ల ఆధారంగా ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు నడిపించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.బస్సు నంబరు 47 ఎల్ రాకపోకలుసికింద్రాబాద్ నుంచి మణికొండ : సికింద్రాబాద్- బేగంపేట- నాగార్జున సర్కిల్ - ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్- బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ- ఒమేగా- అపోలో ఆస్పత్రి- ఫిల్మ్‌నగర్- దర్గా- మణికొండమణికొండ నుంచి సికింద్రాబాద్: మణికొండ- పంచవటికాలనీ, దర్గా- ఫిల్మ్‌నగర్ - జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో- ఎల్వీ ప్రసాద్

హాస్పిటల్- టీవీ9 (మసీద్)- పంజాగుట్ట పీఎస్- ఆర్‌జే కాలేజీ- పోలీస్ లైన్- ప్లాజా- సికింద్రాబాద్.బస్సు నంబరు 222 కోఠి నుంచి పటాన్‌చెరు: కోఠి- లక్డీకాపూల్- మాసబ్‌ట్యాంక్- నాగార్జున సర్కిల్- ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్- బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ- ఒమేగా- ఆపోలో ఆస్పత్రి- జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- పెద్దమ్మగుడి - మాదాపూర్ పీఎస్- పటాన్ చెరు.పటాన్‌చెరు నుంచి కోఠి: పటాన్‌చెరు- మాదాపూర్ పీఎస్- పెద్దమ్మగుడి- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో- ఎల్వీ ప్రసాద్- నాగార్జున సర్కిల్- మాసబ్‌ట్యాంక్ - లక్డీకాపూల్- కోఠికోఠి నుంచి కొండాపూర్ : కోఠి- లక్డీకాకపూల్ - మాసబ్‌ట్యాంక్- పెన్షన్ ఆఫీస్ - ఎమ్మెల్యే కాలనీ- అపోలో ఆస్పత్రి- రోడ్డు నంబర్ 45 - మాదాపూర్ పీఎస్- కొండాపూర్.కొండాపూర్ నుంచి కోఠి : కొండాపూర్- మాదాపూర్ పీఎస్- రోడ్డు నంబరు 45- జర్నలిస్ట్ కాలనీ- జూబ్లీహి ల్స్ చెక్‌పోస్ట్- అన్నపూర్ణ స్టూడియో - ఎల్వీ ప్రసాద్- బసవతారకం హాస్పిటల్ - బీఆర్ఎస్ భవన్- ఎమ్మెల్యే కాలనీ - పెన్షన్ ఆఫీస్- మాసబ్‌ట్యాంక్ - కోఠి.బస్సు నంబరు 10 హెచ్‌సికింద్రాబాద్ నుంచి కొండాపూర్ :సికింద్రాబాద్- బేగంపేట- మైత్రివనం- యూసుఫ్ గూడ ఎక్స్‌రోడ్- వెంకటగిరి- నవయుగా - పెద్దమ్మగుడి- మాదాపూర్ పోలీస్ స్టేషన్ - కొండాపూర్.కొండాపూర్ నుంచి సికింద్రాబాద్: కొండాపూర్- పెద్దమ్మగుడి- జూబ్లీచెక్ పోస్టు- వెంకటగిరి - యూసుఫ్ గూడ- మైత్రివనం-బేగంపేట- సికింద్రాబాద్.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

గురువారం, ఆగస్టు 20, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

సీఎం చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారు

అమరావతి, ఆగస్టు19: ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని వెలుగొండ ప్రా జెక్ట్ నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయాన్ని తాము మర్చిపోలేమన్నారు. తమ 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు జీవిత ంలో పూర్తవుతుందని తాము అనుకోలేదని అన్నారు. చూడలేం అనుకున్న ప్రాజెక్టును చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని నిర్వాసితులు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు చెక్కులు అందజేశారు. బుధవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సీఎంను ప్రాజెక్టు నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా వారికి రూ.200 కోట్ల మేర పరిహారం చెక్కులు అందించారు. అనంతరం నిర్వాసితులుపై విధంగా స్పందించారు.ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితులు ముఖ్యం: మంత్రి నిమ్మలవెలుగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పూర్తి కాని వెలుగొండ ప్రాజెక్టు పూర్తయినట్లు వైఎస్ జగన్ జాతికి అంకితం చేయటం ప్రపంచంలో 8వ వింత అని అభివర్ణించారు. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో నాడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పైసా కూడా చెల్లించలేదని ఆయన గుర్తు చేశారు.వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయటం ఎంత ముఖ్యమో.. నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నిర్వాసితుల కోసం నిర్మించిన 7 కాలనీల్లో నాలుగింటిలో 100 శాతం మౌలిక వసతులు వివరించారు. మిగిలిన 3 కాలనీల్లోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్‌ను ఏపీ నుంచి నేర్చుకోవాలి

ఏపీ ప్రభుత్వ పాలన విధానాలు, అమలు చేస్తున్న సంస్కరణలు సత్ఫలితాలనిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, స్మార్ట్ గవర్నెన్స్ అద్భుతమంటూ దిల్లీ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. మంత్రులు లోకేశ్, భరత్‌తో సమావేశమైన దిల్లీ ప్రభుత్వ ప్రతినిధుల బృందం ఏపీ ప్రభుత్వ విధానాలపై అధ్యయనంతో పాటు పెట్టుబడుల ఆకర్షణ, డేటా ఆధారిత పాలనపై చర్చించింది.దిల్లీ అధికారులకు సహకారం: పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏపీ దేశానికే మార్గదర్శిగా నిలుస్తోందని దిల్లీ ప్రభుత్వ ప్రతినిధులు కితాబిచ్చారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో మంత్రి లోకేశ్ దిల్లీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏపీ పారిశ్రామికాభివృద్ధి విధానం ఎంతో ఆకర్షణీయంగా ఉందని దిల్లీ పరిశ్రమలశాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్? శిర్సా అన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను తాము అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. పెట్టుబడులకు అనుకూల

వాతావరణం కల్పించేందుకు సింగిల్? డెస్క్? విధానం అమలు చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ వివరించారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్స్? క్లస్టర్‌తో పాటు అమరావతి, తిరుపతి, విశాఖ ప్రాంతాలను ఎకనామిక్? జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ఏపీలో అమలు చేస్తున్న విధానాలపై మరింత అవగాహన కోసం దిల్లీ అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ప్రశంసలు: ఏపీ స్మార్ట్ గవర్నెన్స్ విధానాలపై దిల్లీ ప్రతినిధుల బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. ప్రభుత్వంలోని వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేసి డేటా లేక్ ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. పలు వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి నిరంతరం విశ్లేషించడం ద్వారా పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని పనితీరును ఎప్పటిక ప్పుడు అంచనా వేస్తున్నట్లు వివరించారు. మంత్రుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు పనితీరును పరిశీలిస్తూ ర్యాంకింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఏపీ ప్రభుత్వం డేటాను సమర్థంగా వినియోగిం చుకుని మంచి ఫలితాలు సాధిస్తోందని దిల్లీ మంత్రి ప్రశంసించారు. డేటా ఆధారిత పాలన, స్మార్ట్ గవర్నెన్స్‌లో ఏపీ అనుభవం తమకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ రంగాల్లో ఏపీ బృందాన్ని దిల్లీకి పంపి తమ అధికారులకు విధానాలను వివరించాలని కోరారు.అమరావతి రాజధాని నిర్మాణ పనులను చూసి ఆశ్చర్యానికి గురైనట్లు దిల్లీ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా నిలుస్తుందని అభిప్రాయప డ్డారు. సీఎం చంద్రబాబు విజన్‌ను ప్రశంసిం చడంతో పాటు ఆయన్ను విశ్వవిద్యాలయంతో పోల్చారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా పోస్టులను పూర్తి చేశారంటూ లోకేశ్‌ను దిల్లీ మంత్రి కొనియాడారు. దిల్లీలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ కోర్టు కేసులు, ఫిర్యాదులతో సంక్లిష్టంగా మారుతోందని తెలిపారు. ఏపీలో పారదర్శకంగా చేపట్టిన డీఎస్సీ నియామక విధానాన్ని తెలుసుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. త్వరలో మరో 3 వేల మందికిపైగా ఉపాధ్యాయులను నియమించనున్నట్లు లోకేశ్ చెప్పారు.మొత్తంగా ఏపీ పారిశ్రామిక విధానాలు, డేటా ఆధారిత పాలన, విద్యా సంస్కరణలు దిల్లీ ప్రభుత్వాన్ని ఆకట్టుకున్నాయి. రాష్ట్ర అనుభవాలను దిల్లీతో పంచుకునేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య విధానపరమైన సహకారం మరింత బలోపేతం కానుంది.

తుంగభద్ర నీటి లభ్యతపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష తాగునీటికే తొలి ప్రాధాన్యం

రాయలసీమ ప్రాంతంలో జూలై 2027 వరకు తాగునీటి కొరత లేకుండా చూడటమే లక్ష్యంగా అందుబాటులో ఉన్న పరిమిత నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు, చెరువులను నింపడానికి మాత్రమే వినియోగించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. 'ఎల్ నినో' ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత, రాయలసీమకు నీటి కేటాయింపులపై ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.తాగునీటి పై సమీక్ష : అందుబాటులో ఉన్న పరిమిత నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు చెరువులను నింపడానికి వినియో గించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాయలసీమకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ

ఇన్‌ఛార్జ్‌లు, తుంగభద్ర డ్యామ్ ఇంజనీర్లు, నీటిపారుదల సలహాదారు వెంకటేశ్వరరావు ఇంజనీర్-ఇన్-చీఫ్ నరసింహ మూర్తి పాల్గొన్నారు. 'ఎల్ నినో' వంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో, లో-లెవల్ కెనాల్ హై-లెవల్ కెనాల్ లకు నీటి కేటాయింపులు, వినియోగంపై ఆయన అధికారులు ఎమ్మెల్యేలతో చర్చించారు.నీటి విర్వాహణ అమలు : ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 105 టీఎంసీల నీరు మాత్రమే వస్తుందని అంచనా వేస్తున్నట్లు, అందులో ఆంధ్రప్రదేశ్ వాటా 32.9 టీఎంసీలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఏపీ వాటాలో నూజకి 11.88 టీఎంసీలు, గూజకి 16.09 టీఎంసీలు ఖ-జ కెనాల్‌కు 4.95 టీఎంసీల నీటిని కేటాయించనున్నట్లు వారు వివరించారు. జూలై 2027 వరకు రాయలసీమలో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు నిమ్మల పేర్కొన్నారు. ఎలకెనాల్ హై-లెవల్ కెనాల్ లకు నీటి నినో పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం సూచించిందని మంత్రి వెల్లడించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ రాయలసీమకు నీటి సరఫరాను కొనసాగించేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ విధానాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు

అమరావతి, ఆగస్టు19: ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపా లన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్ని కల్లో నేరు ఎంపికైన వారికి బలమైన ప్రజా మోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసె ంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ చైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, చైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు.అంతకుముందు అసెం బ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎంపిక ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరగనుంది. ఇప్పటి వరకూ వీరిద్దరిని పద్ధతిలో ఎన్నుకుంటున్న సంగతి తెలిసిందే.

ఏపీ మండలి డిప్యూటీ చైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ ఏకగ్రీవ ఎన్నిక

అమరావతి : ఆంధ్రప్రదేశ్ మండలి డిప్యూటీ చైర్మన్ గా వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలిలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యుల కంటే వైసీపీ సభ్యులు మెజార్టీ సంఖ్యలో ఉండడంతో కూటమి తరుపున ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో బుధవారం మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. అనంతరం మాధవరావును చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. ఈ కార్యక్రమానికి కూటమి సభ్యులు చైర్మన్ సీటు వద్దకు రాకపోవడంతో మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి సభ్యులు సభా సంప్రదాయాలను పాటించడం లేదని ఆరోపించారు. చైర్ పట్ల అగౌరవంగా వ్యవహరించడం మంచిది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని, సభా సాంపరదాయాలు, గౌరవాలు శాశ్వతం అని అన్నారు.

త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతా

త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్టు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రకటించారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుకను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలిపారు.త్వరలో రాజకీయ ప్రణాళిక: దేశం సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నినో ప్రభావం లేకుండా సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు. విజయవాడలో మీడియా ప్రతినిధులతో తన కొత్త పార్టీ గురించి అన్ని వివరాలు చెబుతానన్నారు.విజయసాయి రెడ్డి వైఎస్సార్సీపీని వీడి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే

ప్రచారం కొంతకాలంగా సాగుతుండగా, తిరుమల వేదికగా ఆయన చేసిన ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం నమోదైంది. కొత్త పార్టీ పేరు, ఎజెండా, విధివిధానాలు ఎలా ఉండబోతోందనే అంశంపై ఇప్పు డు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గతంలోనూ కీలక వ్యాఖ్యలు: అయితే జులైలో మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని గతంలో ప్రకటించిన విజయసాయి రెడ్డి తాజాగా కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. ప్రజా పక్షంగా పనిచేస్తూ వారి గొంతుకగా నిలిచేలా పార్టీని తీర్చిదిద్దుతానని చెప్పారు. రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో వైఎస్సా ర్సీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు వాస్తవ పరిస్థితిని గుర్తించి ప్రజా సమస్య లపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలో మీడియా రంగంలోకి కూడా వస్తానని తెలిపా రు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను ఈ నెలలోనే వెల్లడిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. విజయసాయిరెడ్డి గతేడాది రాజ్యసభ ఎంపీ పదవికి, రాజకీయా లకు రాజీనామా చేశారు. అప్పట్లో తాను ఇకపై ఏ పార్టీలో చేరనని, కేవలం వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా సరికొత్త రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. వైఎస్ కుటుంబంలో మూడు తరాలతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా విజయసాయిరెడ్డికి అను బంధం ఉంది. అలాంటి నేత ఇప్పుడు వైఎస్సా ర్సీపీకి గుడ్‌బై చెప్పి, సరికొత్త పార్టీతో పొలిటి కల్ రీ-ఎంట్రీ ఇస్తుండటం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

విశాఖలో డేటా సెంటర్లపై విమర్శలు.. మంత్రి లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్

అమరావతి, ఆగస్టు 19 : విశాఖపట్నం డేటా సెంటర్లపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జనసేన ఎమ్మెల్యే నాగమాధవి డేటా సెంటర్లపై అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ఈ మేరకు సమాధానం ఇచ్చారు. డేటా సెంటర్ల నీటి వినియోగంపై దుష్ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత డిజిటల్ ఎకానమీకి డేటా సెంటర్లు అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. గూగుల్ పెట్టుబడితో విశాఖపై ఇతర ఐటీ కంపెనీలకు ఆసక్తి పెరిగిందని వ్యాఖ్యానించారు. డేటా సెంటర్ల ఎకోసిస్టమ్ 6.5 +ఔకు చేరితే ఏడాదికి సుమారు 3 టీఎంసీల నీరు అవసరమని వెల్లడించారు.ఆ నీటిని డేటా సెంటర్లకు మళ్లించం..కొత్త కూలింగ్ టెక్నాలజీలతో డేటా సెంటర్ల నీటి వినియోగం మరింత తగ్గుతుందని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు. డేటా సెంటర్లకు

పోలవరం నీటిలో పారిశ్రామిక కేటాయింపుల నుంచే నీరు వస్తోందని వివరించారు. విశాఖ నగర ప్రజల నీటి అవసరాలకు కేటాయించిన నీటిని డేటా సెంటర్లకు మళ్లించమని స్పష్టం చేశారు. పోలవరం నుంచి విశాఖపట్నం నగరానికి గ్రావిటీ ద్వారా నీటి సరఫరాను 18 నెలల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. 1 +ఔ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్‌కు దాదాపు పదో వంతు నీరే అవసరమని వెల్లడించారు.అలా డేటా సెంటర్లను అభివృద్ధి చేస్తాం..థర్మల్ పవర్ ప్లాంట్ల నీటి వినియోగంపై కాకుండా డేటా సెంటర్లపైనే ఎందుకు నిరసనలు? చేస్తున్నారని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. డేటా సెంటర్ కేటాయింపులకు 6.5 +ఔ పరిమితి విధించినట్లు సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. 6.5 +ఔ డేటా సెంటర్ కేటాయింపుల లక్ష్యం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే కంపెనీలకే తమ ప్రభుత్వం ప్రయారిటీ ఇస్తుందని స్పష్టం చేశారు. విశాఖపట్నం ప్రజల నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా డేటా సెంటర్ల అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

విజయవాడలో భారీ కార్పొరేట్ మోసం..

విజయవాడ, ఆగస్టు 19 : విజయవాడలో భారీ కార్పొరేట్ మోసం వెలుగులోకి వచ్చింది. తప్పుడు సమాచారంతో యూనియన్ బ్యాంక్ నుంచి రూ. 24 కోట్లను నిందితులు కొట్టేశారు. యూనియన్ బ్యాంక్ ద్వారా లోన్ తీసుకున్న డబ్బుతో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు చేయకుండా లోన్ మొత్తాన్ని షెల్ కంపెనీల ద్వారా నిందితులు మళ్లించారు. ఈ క్రమంలో ఆ బ్యాంకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 23.85 కోట్లకు బదులుగా కేవలం రూ.25 లక్షల నిల్వలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి సీబీఐకి యూనియన్ బ్యాంక్ ఏజీయం శ్రీకాంత్ పాత్రో ఫిర్యాదు చేశాడు. యూనియన్ బ్యాంక్ నుంచి ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోన్ తీసుకునట్లు ఆ బ్యాంక్ ఏజీయం తెలిపారు. బ్యాంక్ లోన్ రాగానే ఆరు నెలల్లోనే ఇద్దరు డైరెక్టర్ల రాజీనామా చేశారు. ఈ కేసులో నిందితులుగా డైరెక్టర్లు కోట భానుప్రసాద్, కోట శ్రావణి, కోట పృథ్వీ వెంకటతేజ, కోట రాహుల్ సాయి బాలాజీతో పాటు బ్యాంకు ఉద్యోగులను సీబీఐ అధికారులు చేర్చారు.